# ఆతిథ్య రంగ కెరీర్‌కు.. అద్భుత వేదిక

**దేశంలో హాస్పిటాలిటీ రంగం శరవేగంగా విస్తరిస్తోంది.. దీంతో హాస్పిటాలిటీ రంగం దూసుకెళ్తోంది.. ఫలితంగా కొంత కాలం వరకు మెట్రో సిటీలు, ఎ-1 నగరాలకే పరిమితమైన స్టార్ హోటళ్లు, రెస్టారెంట్ల సంస్కృతి ఇప్పుడు చిన్న పట్టణాలకు సైతం విస్తరిస్తుండడంతో.. హాస్పిటాలిటీ రంగ ప్రొఫెషనల్స్‌కు విపరీతమైన డిమాండ్ ఉంటోంది.. కేవలం బ్యాచిలర్ డిగ్రీతో ఈ రంగంలో ప్రవేశించిన వారికి సదరు సంస్థలు రెడ్‌కార్పెట్ స్వాగతం పలుకుతున్నాయి.. దాంతో ఆతిథ్య రంగం 'అవకాశాల తరంగం'గా మారుతోంది..**

### ఎన్‌సీహెచ్‌ఎంసీటీ-జేఈఈ, 2013 ఇన్ఫో

**అర్హత:** ఇంగ్లిష్ ఒక సబ్జెక్ట్‌గా 10+2 లేదా తత్సమానం. చివరి సంవత్సరం విద్యార్థులు కూడా అర్హులే.

**దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. లేదా ఎన్‌సీహెచ్‌ఎంసీటీ అనుబంధ ఇన్‌స్టిట్యూట్‌ల నుంచి కూడా దరఖాస్తులను పొందొచ్చు.

**ఆన్‌లైన్‌లో దరఖాస్తు ముగింపు:** ఏప్రిల్ 15, 2013.
**దరఖాస్తుల స్వీకరణకు చివరి తేదీ (ఆఫ్‌లైన్):** ఏప్రిల్ 15, 2013.
**రాత పరీక్ష తేదీ:** ఏప్రిల్ 27, 2013.
**రాష్ట్రంలో పరీక్ష కేంద్రం:** హైదరాబాద్
**ఫలితాల వెల్లడి:** మే రెండోవారం, 2013.
**వెబ్‌సైట్:** www.nchmct.org

హాస్పిటాలిటీ ఎడ్యుకేషన్‌కు సంబంధించి దేశంలోని ప్రముఖమైన సంస్థ నేషనల్ కౌన్సిల్ ఫర్ హోటల్ మేనేజ్‌మెంట్ అండ్ క్యాటరింగ్ టెక్నాలజీ (ఎన్‌సీహెచ్‌ఎంసీటీ). భారత ప్రభుత్వ పర్యాటక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో పనిచేసే స్వయంప్రతిపత్తి ఉన్న సంస్థ ఎన్‌సీహెచ్‌ఎంసీటీ అనుబంధ ఇన్‌స్టిట్యూట్లలో చేరడం ద్వారా హాస్పిటాలిటీ రంగంలో చక్కని కెరీర్‌కు మార్గం సుగమం చేసుకోవాలనుకే యువత సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. ఈ ఇన్‌స్టిట్యూట్‌లు ఆఫర్ చేసే బీఎస్సీ (హాస్పిటాలిటీ అండ్ హోటల్ అడ్మినిస్ట్రేషన్) కోర్సులో ప్రవేశానికి ఏటా జాయింట్ ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్ (జేఈఈ) నిర్వహిస్తాయి. ఎన్‌సీహెచ్‌ఎంసీటీ- జేఈఈ, 2013 నోటిఫికేషన్ విడుదలైన నేపథ్యంలో సంబంధిత వివరాలు..

### పరిశ్రమ అవసరాలకనుగుణంగా:

ఎన్‌సీహెచ్‌ఎంసీటీ బీఎస్సీ (హాస్పిటాలిటీ అండ్ హోటల్ అడ్మినిస్ట్రేషన్) కోర్సును ఇందిరాగాంధీ నేషనల్ ఓపెన్ యూనివర్సిటీ సహకారంతో నిర్వహిస్తుంది. మూడేళ్ల ఈ కోర్సును ఆరు సెమిస్టర్లుగా విభజించారు. హాస్పిటాలిటీ రంగానికి కావల్సిన నాలెడ్జ్‌ను, స్కిల్స్‌ను పెంపొందించుకోవడానికి వీలుగా ఈ కోర్సు కరిక్యులం ఉంటుంది. ఫుడ్ ప్రొడక్షన్, ఫుడ్ అండ్ బ్రేవరేజ్ సర్వీస్, ఫ్రంట్ ఆఫీస్ ఆపరేషన్ అండ్ హౌస్‌కీపింగ్, ఫుడ్ సేఫ్టీ అండ్ క్వాలిటీ, హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్.. ఇలా ప్రతి విభాగంపై పరిపూర్ణ అవగాహన కల్పించే విధంగా కోర్సును రూపొందించారు. లేబొరేటరీ వర్క్‌కు కూడా ప్రాధాన్యత ఇచ్చారు.

### దాదాపు 7వేల సీట్లు:

రాత పరీక్ష తర్వాత ప్రిపేర్ చేసిన మెరిట్ లిస్ట్ ఆధారంగా దేశ వ్యాప్తంగా 50 ఇన్‌స్టిట్యూట్‌లలో ప్రవేశం కల్పిస్తారు. ఇందులో 21 ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ (ఐహెచ్‌ఎం), 14 స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ (ఎస్ఐహెచ్‌ఎం)లు ఉన్నాయి. మిగిలిన 15 ప్రైవేట్ హోటల్ మేనేజ్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్‌లు. వీటిల్లో దాదాపు 7,500కు పైగా సీట్లు అందుబాటులో ఉన్నాయి.

### ప్రతిభావంతులకు నేరుగా:

ఎన్‌సీహెచ్‌ఎంసీటీ కేవలం రాతపరీక్ష ద్వారానే కాకుండా ప్రతిభావంతులకు నేరుగా ప్రవేశం కల్పిస్తుంది. ఇంటర్మీడియెట్/తత్సమాన బోర్డు పరీక్షల్లో ఆర్ట్స్, సైన్స్, కామర్స్ గ్రూప్‌ల్లో 1 నుంచి 200 స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు.. ఆయా గ్రూప్‌ల నుంచి ఒక్కొక్కరు చొప్పున ఐహెచ్‌ఎంలలో నేరుగా అడ్మిషన్ కల్పిస్తుంది. అంతేకాకుండా కోర్సులో చేరిన తర్వాత మెరిట్ స్టూడెంట్స్‌కు చేయూతనిచ్చే ఉద్దేశంతో స్కాలర్‌షిప్స్‌ను కూడా ప్రదానం చేస్తుంది. వార్షిక పరీక్షల్లో జాతీయ స్థాయిలో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు ఎన్‌సీహెచ్‌ఎంసీటీ మెరిట్ బేస్డ్ స్కాలర్‌షిప్స్‌ను కూడా అందజేస్తుంది. ఎస్సీ/ఎస్టీ విద్యార్థులకు సంవత్సరానికి రూ. 20 వేల ఆర్థిక సహాయాన్ని కూడా మంజూరు చేస్తుంది.

### ఐదు విభాగాలుగా రాత పరీక్ష:

ఎన్‌సీహెచ్‌ఎంసీటీ నిర్వహించే జేఈఈ మొత్తం ఐదు విభాగాల్లో ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటుంది. ఇంగ్లిష్/ హిందీ భాషల్లో మాత్రమే పరీక్షను నిర్వహిస్తారు. 200 ప్రశ్నలకు మూడు గంటల్లో సమాధానాలను గుర్తించాలి. విద్యార్థులు అవగాహన కోసం ఎన్‌సీహెచ్‌ఎంసీటీ వెబ్‌సైట్‌లో మాదిరి ప్రశ్నపత్రాన్ని కూడా అప్‌లోడ్ చేశారు.

| విభాగాలు | మార్కులు |
|---|---|
| న్యూమరికల్ ఎబిలిటీ అండ్ సైంటిఫిక్ ఆప్టిట్యూడ్ | 30 |
| రీజనింగ్ అండ్ లాజికల్ డిడక్షన్ | 30 |
| జనరల్ నాలెడ్జ్ అండ్ కరెంట్ అఫైర్స్ | 30 |
| ఇంగ్లిష్ లాంగ్వేజ్ | 60 |
| ఆప్టిట్యూడ్ ఫర్ సర్వీస్ సెక్టార్ | 50 |

- ఆప్టిట్యూడ్ ఫర్ సర్వీస్ సెక్టార్ మినహా అన్ని విభాగాల్లో నెగిటివ్ మార్కింగ్ ఉంది.

## ఇంగ్లిష్:

జేఈఈ ఎగ్జామ్ ప్యాట్రన్ పరిశీలిస్తే.. మొత్తం ఐదు విభాగాల్లో ఇంగ్లిష్‌కు అత్యధిక వెయిటేజీ ఇచ్చారు. దీనికి 60 మార్కులు కేటాయించారు. ఈ విభాగంలో ఎక్కువ స్కోరు చేసే అభ్యర్థులే మెరుగైన ర్యాంకు సాధించే అవకాశం ఉంది. కాబట్టి ఇంగ్లిష్ విభాగంపై ఎక్కువ దృష్టి సారించాలి. ఇందుకోసం పదో తరగతి వరకు బేసిక్ గ్రామర్‌పై పట్టు సాధించాలి. టెన్సెస్, రూల్స్ ఆఫ్ కరెక్ట్ యూసేజ్, రూల్స్ ఆఫ్ కంజెక్షన్, ప్రిపోజిషన్స్, స్పాటింగ్ ఎర్రర్స్, ఇంప్రువ్‌మెంట్ ఆఫ్ సెంటెన్సెస్, వన్‌వర్డ్ సబ్‌స్టిట్యూషన్, సెంటెన్స్ కంప్లిషన్, సీక్వెన్స్ ఆఫ్ వర్డ్స్ తదితర అంశాలపై ప్రశ్నలు అడిగే అవకాశం ఉంటుంది. ఇందులో రాణించాలంటే.. పదాలపై పట్టు సాధించాలి. ప్రతి రోజు కొన్ని కొత్త పదాలను నేర్చుకోవాలి. కేవలం పదాలను తెలుసుకోవడానికే పరిమితం కాకుండా.. వాటి ఉపయోగంపై కూడా అవగాహన పెంచుకోవాలి. ప్రతిరోజు ఇంగ్లిష్ న్యూస్ పేపర్లు, మ్యాగజీన్లను విశ్లేషణాత్మక దృష్టితో చదవాలి. వాటిలో ఉపయోగించిన పదాలు, వాక్యనిర్మాణ క్రమాన్ని జాగ్రత్తగా పరిశీలించాలి.

**మోడల్ కొశ్చన్ ఉదాహరణకు:**
Harm : Damage (1) sweet : sour (2) stout : weak (3) injure : incapacitate (4) hook : crook
**రిఫరెన్స్ బుక్స్:** రెన్ అండ్ మార్టిన్, వర్డ్ పవర్ మేడ్ ఈజీ.

## జనరల్ నాలెడ్జ్ అండ్ కరెంట్ అఫైర్స్:

ఈ విభాగంలో ఎక్కువగా చరిత్ర, జాగ్రఫీ, స్పోర్ట్స్, అవార్డులు, ముఖ్య సదస్సులు, జనరల్ నాలెడ్జ్‌తో పాటు గ్రీన్ హౌస్ ఎఫెక్ట్, గ్లోబల్ వార్మింగ్ వంటి సమకాలీన అంశాలపై ప్రశ్నలు ఉంటాయి. **మోడల్ కొశ్చన్ ఉదాహరణకు:** World's tallest building is? కరెంట్ అఫైర్స్ కోసం.. పరీక్ష జరిగే తేదీకి ముందు సంవత్సర కాలంలో జరిగిన ప్రధాన అంశాలను (సదస్సులు, సమావేశాలు, ఒప్పందాలు, వ్యక్తు లు, విజయాలు, అవార్డులు వంటివి) తెలుసుకోవాలి. **మోడల్ కొశ్చన్ ఉదాహరణకు:** The host of 2018 World Cup of Football is (1) Qatar (2) Russia (3) Japan (4) India

**రిఫరెన్స్ బుక్స్:** మనోరమ, పియర్సన్ ఇయర్ బుక్స్, సాక్షి, హిందు దిన పత్రికలు.

## న్యూమరికల్ ఎబిలిటీ సైంటిఫిక్ ఆప్టిట్యూడ్:

ఈ విభాగంలో 30 ప్రశ్నలు ఉంటాయి. మ్యాథమెటిక్, సైన్సెస్‌లో ప్రాథమిక అవగాహన స్థాయిని పరీక్షించే విధంగా ఏడు నుంచి పదో తరగతి స్థాయి ప్రశ్నలు ఎదురవుతాయి. ఇందులో నెంబర్ సిస్టమ్, పర్సంటేజ్, ప్రాఫిట్-లాస్, ఏవరేజ్, టైమ్-వర్క్, సింపుల్ ఇంట్రెస్ట్, కంపౌండ్ ఇంట్రెస్ట్, టైమ్-స్పీడ్-డిస్టెన్స్, జ్యామెట్రీపై ఎక్కువ దృష్టి సారించాలి. మోడల్ కొశ్చన్ ఉదాహరణకు: What is the number of numbers between 400 and 500 if both the numbers are counted?
సైన్సెస్ (ఫిజిక్స్, కెమిస్ట్రీ)లో *The stored food material found in muscles is?* వంటి థియరిటికల్‌తో పాటు 180 గ్రా. నీటిలో మోల్‌ల సంఖ్య ఎంత? వంటి న్యూమరికల్ ప్రశ్నలు కూడా ఎదురవుతాయి.
**రిఫరెన్స్ బుక్స్:** ఎన్‌సీఈఆర్‌టీ ఏడు నుంచి పదో తరగతి మ్యాథ్స్, సైన్స్ పుస్తకాలు.

## రీజనింగ్ అండ్ లాజికల్ డిడక్షన్:

అభ్యర్థిలోని విశ్లేషణాత్మక సామర్థ్యాన్ని పరీక్షించడానికి ఉద్దేశించిన విభాగమిది. కోడింగ్-డీ కోడింగ్, బ్లడ్ రిలేషన్స్, మ్యాథమెటికల్ ఆపరేషన్స్ అండ్ రీజనింగ్స్, కౌంటింగ్ ఆఫ్ ఫిగర్స్, కంప్లిషన్ ఆఫ్ ఫిగర్స్ అండ్ సిరీస్, ఫార్మేషన్ ఆఫ్ ఫిగర్స్, డేటా సఫిషియన్సీ, కౌంటింగ్ ఆఫ్ ఫిగర్స్, వెన్ డయాగ్రమ్స్ వంటి అంశాలపై పట్టు సాధిస్తే ఈ విభాగంలో రాణించవచ్చు.
**రిఫరెన్స్ బుక్:** -ఎ గైడ్ టు లాజికల్ రీజనింగ్ - ఆర్.ఎస్. అగర్వాల్

## ఆప్టిట్యూడ్ ఫర్ సర్వీస్ సెక్టార్:

అన్నిటిలోకి కీలకమైన విభాగం ఆప్టిట్యూడ్ ఫర్ సర్వీస్ సెక్టార్. ఈ రంగంలో కీలక పాత్ర పోషించే ఇంటర్ పర్సనల్ స్కిల్స్‌ను పరీక్షించే విధంగా ప్రశ్నలు ఉంటాయి. వివిధ సందర్భాల్లో వ్యవహరించే విధానం? పనిచేసే ప్రదేశాల్లో ఎలా వ్యవహరించాలి? తరహా ప్రశ్నలు అడుగుతారు. వ్యక్తిగత విచక్షణ ఆధారంగా నిర్ణయం తీసుకోవాల్సిన ఈ విభాగంలో ఇచ్చిన ఆప్షన్లన్నీ సరైనవే అనిపించే రీతిలో ఉంటాయి. అందుకే ఈ విభాగంలోని ప్రశ్నలకు నిర్ణీత మార్కు అని నిర్దేశించలేదు. 0.25. 0.5, 0.75, 1 అని ప్రతి ప్రశ్నకు మార్కులను విభజించారు. అభ్యర్థి ఇచ్చిన ఆప్షన్, నిర్దేశిత సమాధానం మధ్య సమతుల్యత ఆధారంగా మార్కులు కేటాయిస్తారు. అంటే.. ఎంచుకున్న ఆప్షన్ నిర్ణీత సమాధానానికి సరితూగకపోతే 0.25, పూర్తి స్థాయిలో సరితూగితే ఒకమార్కు కేటాయిస్తారు. వీటికి ఎటువంటి అకడెమిక్ ఓరియెంటేషన్ అవసరం లేదు. మనలోని స్కిల్స్ ఇందులో ఎక్కువ స్కోర్ చేయడానికి దోహదం చేస్తాయనే విషయాన్ని గుర్తుంచుకోవాలి.

మోడల్ కొశ్చన్ ఉదాహరణకు: If you have just been denied promotion and your junior has been selected, what should you do?